

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు. సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్

అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 296 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 10 - 05 - 2025 | పేజీలు : 5

## 400 డ్రోన్‌లతో పాకిస్థాన్ దాడి... వాటిని కూల్చేసిన భారత్ సైన్యం

- భారత్‌లోని 36 సరిహద్దు ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్ల దాడి
- 300-400 డ్రోన్లతో గురువారం రాత్రి దాడులకు పాల్పడిన పాక్
- భారత సైనిక స్థావరాలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు
- పౌర విమానాలను రక్షణ కవచంగా పాక్ వాడుతోందని భారత్ ఆరోపణ

భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ గురువారం రాత్రి భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది. 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు. గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు.

### పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుంది

ఈ దాడుల సందర్భంగా పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుందని భారత రక్షణ శాఖ ప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు ప్రారంభించినప్పటికీ, కరాచీ, లాహోర్ మధ్య పౌర విమాన సర్వీసులను నిలిపివేయలేదని వారు తెలిపారు. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన వస్తుందని తెలిసి కూడా, పౌర విమానాలను అడ్డుపెట్టుకోవడం ద్వారా పాకిస్థాన్ అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని అన్నారు. ఇది భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో ప్రయాణించే విమానాలతో పాటు, పాకిస్థాన్‌లోని పౌర విమానాలకు కూడా సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రార్థనా మందిరాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. అంతర్జాతీయ విమానయాన నిబంధనలను, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారత వాయుసేన పూర్తి సంయమనంతో వ్యవహరించిందని కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు స్పష్టం చేశారు. పాకిస్థాన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి కవ్వింపు చర్యలను భారత్ ఉపేక్షించబోదని వారు హెచ్చరించారు.

ఆపరేషన్ సింధూర్‌పై కీలక ప్రెస్‌మీట్ నిర్వహించింది భారత విదేశాంగ శాఖ. LOC వెంబడి నిరంతరం పాక్ ఉల్లంఘనలకు పాల్పడి సామాన్య పౌరులపై కాల్పులు జరుపుతోందని కల్నల్ సోఫియా ఖురేషీ వెల్లడించారు. నిన్న రాత్రి పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో పాక్ దాడులకు పాల్పడింది. లేహ్ నుంచి సర్‌క్రీక్ వరకు 36 చోట్ల దాడులకు తెగబడిందన్నారు. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా పాక్ ఆర్మీ దాడులు చేసిందని.. టర్కీ డ్రోన్లతో అటాక్ చేసినట్టు ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని, అనేక డ్రోన్లను కైనటిక్, నాన్ కైనటిక్ సాధనాలతో కూల్చేశామని వివరించారు. భారత్ ప్రతిదాడిలో పాక్‌కు తీవ్ర నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. పౌరవిమానాలను కవచంగా ఉపయోగించుకొని పాక్ ఆర్మీ దాడి చేస్తోందని కల్నల్ సోఫియా ఖురేషీ అన్నారు. కరాచీ-లాహోర్ మధ్య విమానాలు తిరుగుతున్నాయని చెప్పారు. భారత్ వాయుసేన ఎంతో సంయమనం పాటిస్తోందని.. ఎయిర్‌స్పేస్ మూసేశామని పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని చెప్పారు.

భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా పాక్ దాడులకు తెగబడిందన్నారు వింగ్ కమాండర్ వోమికా సింగ్. లేహ్ నుంచి సర్‌క్రీక్ వరకు 36 ప్రాంతాలపై డ్రోన్ దాడులు చేశారని., 300-400 డ్రోన్లతో దాడులు చేసేందుకు ప్రయత్నించారని వివరించారు. భద్రతా దళాలు వీటిలో చాలావరకు నిర్వీర్యం చేశాయని వెల్లడించారు. ప్రతిదాడిగా పాక్‌లోని 4 ప్రాంతాలపై భారత్ డ్రోన్లతో దాడి చేసిందన్నారు. పాక్ తన ఎయిర్‌స్పేస్‌ను మూసివేయలేదని.. పౌర విమానాలను పాక్ కవచంలా



వాడుకుంటోందని చెప్పారు.

మరోవైపు 'ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో పాక్ తప్పుడు ప్రచారం తీవ్రంగా చేస్తోందన్నారు కల్నల్ సోఫియా ఖురేషి. ప్రార్థన మందిరాలపై దాడి చేయలేదని పాక్ చెప్పడం అబద్ధం.. ప్రపంచాన్ని మోసం చేసేందుకు పాక్ ప్రయత్నిస్తోందని తెలిపారు. మతం రంగు పూసేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. సామరస్యాన్ని దెబ్బతీసేందుకు కుటిలయత్నాలు చేస్తోంది. కర్తార్‌పూర్ కారిడార్ మూసేశాం. పూంఛ్‌లోని స్కూల్‌పై పాక్ దాడిలో ఇద్దరు విద్యార్థుల మృతి చెందారు. స్కూల్ సిబ్బంది, నన్స్ అందరూ దాక్కున్నారు. దాడి సమయంలో స్కూల్ మూసేసి ఉంది. ఇక గురుద్వారాలు, గుడులు, కాన్వెంట్లు లక్ష్యంగా పాక్ ఆర్మీ దాడులకు తెగబడిందని' ఆమె చెప్పారు.

## ఐపీఎల్ ను ఒక వారం పాటు నిలిపివేస్తున్నాం

* భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు
* సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం
* ఐపీఎల్ నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్న బీసీసీఐ
* దేశ భద్రత కంటే ఏదీ ముఖ్యం కాదన్న భారత క్రికెట్ బోర్డు

ప్రస్తుతం జరుగుతున్న టాటా ఐపీఎల్ 2025ను తక్షణమే వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధికారిక ప్రకటన చేసింది. ఇటీవలి ఉగ్రదాడి, పాకిస్థాన్ సాయుధ బలగాల దుందుడుకు చర్యలు, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు నేటి మధ్యాహ్నం బీసీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఐపీఎల్ పాలకమండలి అన్ని కీలక భాగస్వాములతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు బీసీసీఐ గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చాలా ఫ్రాంచైజీలు తమ ఆటగాళ్ల ఆందోళనలను, మనోభావాలను తెలియజేశాయని, అలాగే ప్రసారదారులు, స్పాన్సర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసిన తర్వాత, సంబంధిత అధికారులు, భాగస్వాములతో చర్చించి టోర్నమెంట్ కొత్త షెడ్యూల్, వేదికల వివరాలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. మన సాయుధ బలగాల శక్తిసామర్థ్యాలపై, సంసిద్ధతపై బీసీసీఐకి పూర్తి విశ్వాసం ఉందని, అయినప్పటికీ అందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకోవడం వివేకవంతమని భావించినట్లు బోర్డు తెలిపింది. ఈ కీలక తరుణంలో బీసీసీఐ దేశానికి పూర్తి అండగా నిలుస్తుందని స్పష్టం చేసింది. కాగా, భారత ప్రభుత్వానికి, సాయుధ దళాలకు, దేశ ప్రజలకు తమ సంఘీభావాన్ని ప్రకటించింది. ఇటీవలి ఉగ్రదాడి, పాకిస్థాన్ సాయుధ బలగాల అకారణ దురాక్రమణకు దీటుగా బదులిస్తూ, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా దేశాన్ని రక్షిస్తూ, స్ఫూర్తినిస్తున్న మన సాయుధ బలగాల ధైర్యసాహసాలకు, నిస్వార్థ సేవకు బీసీసీఐ వందనం సమర్పించింది.

క్రికెట్... మన దేశంలో అత్యంత ఆదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, భద్రత కంటే ఏదీ ఎక్కువ కాదని బీసీసీఐ నొక్కి చెప్పింది. భారతదేశాన్ని రక్షించే అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి బీసీసీఐ కట్టుబడి ఉందని, ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే తమ నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలిపి, అర్థం చేసుకున్నందుకు లీగ్ అధికారిక ప్రసారదారు జియోస్టార్‌కు బీసీసీఐ ధన్యవాదాలు తెలియజేసింది. అలాగే, టైటిల్ స్పాన్సర్ టాటా, ఇతర అనుబంధ భాగస్వాములు, వాటాదారులందరూ కూడా దేశ ప్రయోజనాలను అన్నింటికంటే ఉన్నతమైనవిగా భావించి, ఈ నిర్ణయానికి ఏకగ్రీవంగా మద్దతు పలికినందుకు కృతజ్ఞతలు తెలిపింది.



## సరిహద్దుల్లో పాక్ కాల్పులు.. తెలుగు జవాన్ వీర మరణం

* జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ మృతి
* వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా
* శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌ను సహించలేని దాయాది పాకిస్థాన్ వక్రబుద్ధితో భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన జవాన్‌ను మురళీ నాయక్‌గా గుర్తించారు. వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని కల్లి తండా. గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్లు సమాచారం. శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానున్నట్లు తెలుస్తోంది. కాగా, వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగాడు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ స్కూల్‌లో చదివాడు. జవాన్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో స్వగ్రామం కల్లితండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



దేశ రక్షణ కోసం 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ప్రాణాలర్పించిన వీర జవాన్, పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన మురళి నాయక్ (25) మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.ముఖ్యమంత్రి చంద్రబాబుఅమర జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రులు శ్రీమతి జ్యోతిబాయి, శ్రీ శ్రీరాం నాయక్‌లతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పుత్రశోకంతో బాధపడుతున్న వారిని ఆయన ఓదార్చారు. అతి చిన్న వయసులోనే, కేవలం 25 ఏళ్లకే దేశం కోసం మురళి నాయక్ తన ప్రాణాలను త్యాగం చేశాడని పేర్కొన్నారు.

### జీవితం - వి "చిత్రం"




### ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 10 మే 2025
తిథి : శుద్ధ విదియ ( మ : 2.01 వరకు )
నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు
రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు
యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు
వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు

### ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 10 మే 2025
ఫజర్ : 5.35 ఉదయం
సూర్యోదయం : 6.48 ఉదయం
జొహార్ : 12.34 మధ్యాహ్నం
అసర్ : 3.52 సాయంత్రం
మగ్రిబ్ : 6.19 సాయంత్రం
ఇష : 7.32 సాయంత్రం

జనస్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా



# వైఎస్ జగన్ '2.0' ఇంకో డిజాస్టర్.!

## ఎడిటోరియల్

అధికారం కోల్పోయాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గడచిన పది నెలల్లో ఏం చేసింది.? ప్రజల తరఫున ఏమైనా ప్రజా ఉద్యమాల్లో కనిపించిందా.? ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టిందా. ప్రతిపక్ష నేత.. అనే హోదా కావాలనుకుంటున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, 'ఆ దిశగా' ప్రజల మెప్పు పొందగలుగుతున్నారా.? 'వైఎస్ జగన్ 2.0' చూడబోతున్నారంటూ వైసీపీ అధినాయకత్వం సంకేతాలు పంపడం, వైసీపీ శ్రేణులు, 'కూటమి కుప్ప కూలుతుంది.. మేమే అధికారంలోకి వస్తాం..' అని భ్రమల్లో బతికెయ్యడం చూస్తూనే ఉన్నాం. జమిలి ఎన్నికలొస్తాయ్.. రెండేళ్ళలోనే.! కాదు కాదు, ఈలోగానే ప్రభుత్వం పడిపోతుంది.! ఇలా ఏవేవో ఊహించేసుకుని, పగటి కలలు కనేస్తున్నారు వైసీపీ నేతలు, కార్యకర్తలు. ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే.! వైసీపీని నేతలు ఒకరొకరుగా వీడుతున్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి ఒక్కో 'కీలకమైన సీటూ' కోల్పోతూ వస్తోంది వైసీపీ. విశాఖ మేయర్ పీఠం సహా, చాలా కీలక పదవుల్ని వైసీపీ కోల్పోగా, కూటమి ఆ అవకాశాల్ని ఒడిసిపడుతూ వస్తోంది. ఇదంతా ఎందుకు జరుగుతోందన్న ఆత్మ విమర్శ వైసీపీ చేసుకోలేకపోతోంది. పొద్దున్న లేస్తే, దుష్ప్రచారం మాత్రమే.. ఎజెండా.. అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది. దాంతో, వైసీపీ నేతలు, కార్యకర్తల్లోనూ చాలామంది అధినాయకత్వాన్ని అసహ్యించుకునే పరిస్థితి వస్తోంది.

కార్యకర్తల్ని పట్టించుకుంటాం, కార్యకర్తల్ని ఆదుకుంటాం.. అని వైఎస్ జగన్ చెబుతున్న మాటల్ని కార్యకర్తలెవరూ నమ్మడంలేదు.



అంతెందుకు, వైసీపీ ఉప్పు తిన్న, వైసీపీ అను'కుల' మీడియా కూడా, 'జగన్ 2.0'ని తీవ్రంగా తప్పు పడుతుండడం గమనార్హం. విశాఖలో, ఓ సంస్థకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన భూ కేటాయింపుల విషయమై వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ఆరోపణలు, వైసీపీ క్యాడర్ చేస్తున్న దుష్ప్రచారం.. అంతా ఫేక్ అని తేలిపోయింది. ఇలా ప్రతిసారీ జరుగుతూ ఉంటే, క్యాడర్‌కి కూడా అధినాయకత్వంపై నమ్మకం పోతుంది. వారానికోసారి బెంగళూరు నుంచి హడావిడి చేసి, మీరంతా దుష్ప్రచారానికే పరిమితం కండి.. అని శ్రేణులకు అధినాయకత్వం ఇస్తున్న టాస్కులు, వైసీపీ కొంప ముంచుతున్నాయి.

## ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి ఆర్ అండ్ ఆర్ సమస్యలు వివరించిన నాయకులు

**వి.ఆర్.పురం, మే 9 (జనస్వరం) :** స్థానిక రేఖపల్లి వద్ద గల మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ ముఖ్య నాయకులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశానుసారం, ఆర్ అండ్ ఆర్ గ్రామసభల్లో ప్రజల నుంచి వస్తున్న సమస్యలపై నాయకులు చర్చించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు మరియు కూటమి ప్రభుత్వం పనితీరుపై dissatisfaction వ్యక్తం చేస్తూ, స్థానిక ఎమ్మెల్యేకు చరవాణి ద్వారా పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే శిరీష దేవి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ ఆర్ అధికారులు, ఐటిడిపిఓలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని మండల కమిటీకి తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు వల్ల రంగా రెడ్డి, ఎం. రామారావు, బొర్రా నరేష్, జంగాల మల్లికార్జునరావు, బొర్రా నరసింహారావు, బీరకా సూర్యప్రకాశ్ రావు, ముత్యాల చంద్రశేఖర్, బొర్రా ఆది, ఎం. శంకర్రావు, సత్యనారాయణ, వెంకన్న, ముత్యాలరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.




## వడ్డీ కట్టించుకొని పంట రుణాలు రెన్యూవల్ చేయాలని డిమాండ్

**తనకల్లు, మే 9, జనస్వరం న్యూస్ :** తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో ఉన్న యూనియన్ బ్యాంకులో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ డి. శ్రీనివాసులు రెడ్డి గారిని కలుసుకొని రైతుల సమస్యలపై చర్చించారు. రైతులు అసలు, వడ్డీ మొత్తం చెల్లించినపుడే రుణాలు రీన్యూవల్ చేస్తామని ఫీల్డ్ ఆఫీసర్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు రైతు సంఘ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సత్యసాయి జిల్లా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొక్కంటి క్రాస్ యూనియన్ బ్యాంకును సందర్శించి మేనేజర్‌తో సంప్రదింపులు జరిపారు. రైతులు తీవ్రంగా కష్టపడుతున్నారని, కరువు, అనావృష్టి కారణంగా రైతాంగం తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉందని వారు పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు సహకరించి వడ్డీ చెల్లించేందుకు అనుమతించి, రీన్యూవల్‌కు అవకాశం ఇవ్వాలని సూచించారు. ఈ క్రమంలో, రీజినల్ మేనేజర్ సరోజ్ ఠాకూర్ గారితో జిల్లా కార్యదర్శి మహదేవ్ మరియు కమతం కాటమయ్య మాట్లాడిన అనంతరం, వడ్డీ కట్టించి రీన్యూవల్ చేసుకోవడానికి బ్యాంకు అధికారులు అంగీకరించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వారు సమయానికి రీన్యూవల్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్ప యాదవ్, రైతు సంఘం మండల కార్యదర్శి ఇక్బాల్, సీపీఐ మండల కార్యదర్శి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.



## ఉత్కంఠభరిత పోరులో 40 ప్రోస్ ఘన విజయం

**- యూనిటీ కప్ చింతపల్లి సీజన్-3 టోర్నీ... తేజ అద్భుత ప్రదర్శన**

**- మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా తేజ... బీజేపీ నేత శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం**

**చింతపల్లి, మే 9 (జనస్వరం) :** చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రికెట్ క్రీడా పండుగ యూనిటీ కప్ చింతపల్లి సీజన్-3 టోర్నమెంట్‌లో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ముఖ్యంగా 40 ప్రోస్ జట్టు మరియు బంధ వీధి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసింది. పొట్టి ఫార్మాట్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంధ వీధి జట్టు మొదట బ్యాటింగ్‌కి దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో వారు 73 పరుగులు నమోదు చేశారు. ప్రారంభంలో నెమ్మదిగా సాగిన వారి ఇన్నింగ్స్‌కు మధ్య ఓవర్లలో కొంత ఊపు వచ్చినా, 40 ప్రోస్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన కారణంగా భారీ స్కోరు చేయలేకపోయారు. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన 40 ప్రోస్ జట్టు ప్రారంభంలో కొంత ఒత్తిడికి గురై మూడు వికెట్లు కోల్పోయింది. కానీ నాలుగో ఓవర్లో నుంచి మోమెంటం అందుకుని ధాటిగా ఆడింది. ముఖ్యంగా యువ ఆటగాడు తేజ చురుకైన బౌలింగ్‌తో నాలుగు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థులను కట్టడి చేయడమే కాకుండా, బ్యాటింగ్‌లోనూ శక్తివంతంగా వ్యవహరించాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా తేజకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ పురస్కారం లభించింది. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కదుల శ్రీనివాసరావు చేతుల మీదుగా తేజకు ప్రత్యేకంగా రూపొందించిన శీల్డును అందజేశారు. 40 ప్రోస్ జట్టు కెప్టెన్ చల్లంగి నరేష్ నాయకత్వంలో చూపించిన ఈ విజయ ప్రదర్శన టోర్నమెంట్‌లో వారికి మరింత మన్ననను తీసుకొచ్చింది. ఈ క్రికెట్ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించడానికి వేదికలుగా అవుతున్నాయి. అలాగే, స్థానిక క్రీడాభిమానులకు ఉత్సాహభరితమైన వినోదాన్ని అందిస్తూ మంచి ఆదరణ పొందుతోంది. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు దొండ చినబాబు, వజ్రపు లోకేష్, తరుణ్, బీజేపీ అల్లూరి జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు గొర్లె సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.





## సామాన్యుల ఆరోగ్య రక్షణే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యం : ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు, మే 9, (జనస్వరం) :** సామాన్యుల ఆరోగ్య రక్షణే కూటమి ప్రభుత్వం అంతిమ లక్ష్యముగా ముందుకెళ్తుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 23 మందికి 17 లక్షల7 2,581 రూపాయలను గురువారం బడేటి చంటి క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా అవినీతి మయం చేసిన గనుల ఉన్నారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా సీనియర్ రిపోర్టర్ నాని కి సీఎంఆర్ఎఫ్ చెక్కును బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ,టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, మరియు మూడవ డివిజన్ టిడిపి ఇంచార్జ్ జాలా బాలాజీ కలిసి అందించారు.




## జ్వరంతో ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్ష తప్పనిసరి

**చింతపల్లి/జీకే వీధి, మే 9 (జనస్వరం) :** సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే ప్రతి జ్వర రోగికి తప్పనిసరిగా రక్తపరీక్షలు నిర్వహించాలని అల్లూరి జిల్లా మలేరియా అధికారిణి ఎం. తులసి స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆ సందర్భంగా రక్తపరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్‌ను పరిశీలించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను సమీక్షించారు. రోగుల రక్త నమూనాలను నిర్ణీత సమయంలో పరీక్షించి, ఫలితాలను త్వరితంగా అందించడం ద్వారా సమయానికి చికిత్స అందించడం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే, వైద్యాధికారిణి కోమలి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావుతో కలిసి పల్లెల నుంచి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో జ్వరాలు, మలేరియా కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్న ఆమె, దోమల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇళ్లలోపల మరియు బయట సమర్థవంతంగా స్ప్రేయింగ్ నిర్వహించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సహకారంతో 100% స్ప్రేయింగ్ అమలుకాగలిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. తదుపరి 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని కూడా ఆమె పరిశీలించారు. నీటి నిల్వలు తొలగించడం ద్వారా దోమల లార్వా నిర్మూలన సాధ్యమవుతుందని, తద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. గ్రామాల్లో నివాసముంటున్న సిబ్బంది జ్వరాలపై పర్యవేక్షణ కొనసాగిస్తూ, ఇంటింటి సందర్శన కార్యక్రమం నిరంతరం చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి కన్నబాబు, నీలకంఠం, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.









## కొత్తపాలెం సచివాలయంలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల ఆహ్వానం

**- కొత్తపాలెం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ రమేష్**

**చింతపల్లి, మే 09 (జనస్వరం) :** మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని సచివాలయం- 1 లో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమయ్యాయని డిజిటల్ అసిస్టెంట్ కిల్లో రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు కోసం నిరీక్షణలో ఉన్న వారికి ఇది తీపి కబురు అని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాకుండా, ప్రస్తుతం ఉన్న కార్డుల్లో సవరణలు చేసుకునేందుకు కూడా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆయన తెలిపారు. కార్డులలో కుటుంబ సభ్యుల చేర్పు, పేర్ల తొలగింపు, చిరునామా మార్పు, కార్డు విభజన, ఆధార్ అనుసంధానం వంటి అంశాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కుమారుడి వివాహం అనంతరం కోడలి పేరును కార్డులో చేర్చాల్సి ఉంటుంది. అలాగే పెళ్లైన కుమార్తె అత్తారింటికి వెళ్తే ఆమె పేరు తొలగించాల్సి ఉంటుంది. కొడుకు, కోడలు వేరుగా కుటుంబం ఏర్పాటు చేసుకుంటే వారికి ప్రత్యేకంగా కొత్త రేషన్ కార్డు కావాలి. ఇలాంటి అవసరాలన్నింటికీ ఈ అవకాశం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరుతూ, బుధవారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చింతపల్లి మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, జనసేన నాయకుడు మఠం శ్రీనివాస్, టిడిపి యువత అధ్యక్షుడు వంజరి గణపతి నాయుడు, చిన్నారావు, గోపినాయక హరిబాబు, గోపినాయక సూరిబాబు, పల్టాసింగి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత గ్రూప్ వన్ గ్రూప్ టూ కోచింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

**- నోట్స్ ప్రిపేర్ చేసుకొని చదివితే జాబ్ గ్యారెంటీ**

**- ఆర్డిఓ విశ్వనాథ్**

**నంద్యాల, మే 9 (జనస్వరం) :** ఎన్సీఈఆర్టీ పుస్తకాలను బేసిక్స్‌తో చదివితే ఉద్యోగ అవకాశాలు పెరిగిపోతాయని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం, శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి విద్యార్థుల కోసం గ్రూప్ వన్, గ్రూప్ టు శిక్షణా తరగతులకు ఉచితంగా సమ్మర్ కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు మనోధైర్యంతో ఎన్.సి.ఆర్.టి పుస్తకాలను చదివితే బేసిక్స్ సులభంగా తెలుసుకోవచ్చన్నారు. వాటితో పాటు హై స్కూల్ బుక్స్ కూడా పూర్తిగా చదవాలని, ఎప్పటికప్పుడు చాప్టర్‌వైజ్ చదవాలని, పర్సనల్ నోట్స్ కూడా తయారు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, గడిచిన ప్రశ్నాపత్రాలను బాగా పరిశీలించడంపై దృష్టి పెట్టాలని, ఆబ్జెక్టివ్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలను సాదాసీదాగా చదవడం వల్ల మెమరీ మెరుగుపడదని, జ్ఞానాన్ని పొందడానికి డిస్క్రిప్టివ్ పద్ధతిలో చదవాలని మరియు స్వతహాగా ఆబ్జెక్టివ్స్ తయారు చేసుకోవాలని చెప్పారు. ఎక్కువగా శ్రమిస్తే, అనేక పర్యాయాలు చదవడం వల్ల మంచి మెమరీ ఉంటుంది, తద్వారా విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. విజయం సాధించలేకపోతే, వారు సమాజంలో మంచి పౌరులుగా రాణించే అవకాశాన్ని పొందవచ్చు, అలాగే సమాజంలో విజ్ఞానవంతులుగా రాణిస్తారని విద్యార్థులకు సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్జన కాలంలోనే పోటీ పరీక్షలకు అనువైన జ్ఞానాన్ని అందించాలని, అందుకోసం మంచి సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌ను తీసుకురావాలని చెప్పారు. ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తానే స్వయంగా యుపిఎస్సి కోచింగ్ కు పంపిస్తానని తెలిపారు. గతంలో కూడా చాలామంది విద్యార్థులకు చేయూతనిచ్చినట్లు, అందులో చాలామంది ఉన్నత పదవుల్లో ఉన్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ కేబివి సుబ్బయ్య, కోచింగ్ ఇన్చార్జి శ్రీ రమేష్, అధ్యాపకులు కుమార్ బాలసుబ్రమణ్యం, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






# తెలంగాణలో ఇంటర్నేషనల్ నర్సెస్ డే పోస్టర్ విడుదల

**హైదరాబాదు, మే 9, జనస్వరం :** తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న రవీంద్రభారతిలో నిర్వహించబోయే ఇంటర్నేషనల్ నర్సెస్ డే వేడుకల పోస్టర్‌ను, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సెక్రటేరియట్‌లో తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మీ, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ వీరమ్మ, నర్సింగ్ ఆఫీసర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్రంలోని నర్సింగ్ ఆఫీసర్లు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే 6,956 మందికి L.B. స్టేడియంలో అపాయింట్మెంట్ పత్రాలు అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే, రాష్ట్రంలో నూతన నర్సింగ్ కాలేజీలకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, మరో 2,300 నర్సింగ్ ఆఫీసర్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుండడం, నిమ్స్ వైద్యశాలలో నర్సింగ్ ఆఫీసర్ల యూనిఫాం డ్రెస్ కోడ్‌లో మార్పులు, నర్సింగ్ క్యాడర్‌లో ప్రమోషన్లు, సాధారణ బదిలీలు జరగడం వంటి విషయాలను వివరించారు. కావున, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్లు అందరూ పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు.



# ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటాం.. ఉద్యమిస్తాం...

**నంద్యాల, మే 9 (జనస్వరం) :** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమమే శరణ్యమని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా వారు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం. రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వి. శివయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవికుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం సంస్కరణల పేరిట పాఠశాల విద్యా రంగంలో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరు రకాల పాఠశాలల స్థానంలో ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలు ఏర్పాటు చేయాలని యత్నించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక్కో రకమైన పాఠశాలకు ప్రత్యేకంగా విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి నిర్ణయించడం వల్ల విద్యా వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5 తరగతుల వరకు మోడల్ ప్రాథమిక లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 6, 7 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో నలుగురు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6, 7, 8 తరగతులు ఉన్నచోట ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండేలా జీవో నంబర్ 55 ప్రకారం అమలు చేయాలన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నా ప్రతి ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుని, వ్యాయామ ఉపాధ్యాయుని పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 45 దాటితే రెండవ సెక్షన్ ఏర్పాటు చేసి, ఆపై ప్రతి 35 మందికి అదనపు సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 12వ పిఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని కోరారు. 11వ పిఆర్సీ బకాయిలు మరియు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా రెవిన్యూ అధికారికి వినతిపత్రం




అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మే 14న విజయవాడలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ ఎం. భాస్కర్ రెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఎస్. జాకీర్ హుస్సేన్, మధు, రమేష్, హుస్సేన్ అలీ, శైలజ, రాములమ్మ, రమాబాయి, సునీత, దస్తగిరి భాష, నౌమాన్ భాష, గాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలాల నుంచి విజయభాస్కర్, నాగశేషుడు, నరేష్ కుమార్, రాజేష్, సంతోష్ కుమార్, బాలసుబ్బయ్య, ఆదినారాయణ, నాగార్జున, రంగనాయకులు, శ్రీనివాసులు, రఫీ, నాగేంద్ర, రాజారెడ్డి, దీపక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

**శంఖవరం, మే 9 (జనస్వరం) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అవినీతి, అరాచక పాలనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దిశాహీనంగా మారిందని, రాష్ట్రానికి కళ తప్పిపోయిందని, అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమతుల్యంగా అమలు చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం శంఖవరం మండలంలో వికలాంగుల సమాఖ్య భవనంలో వెనుకబడిన వర్గాల మహిళల కోసం బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. ఆ ప్రారంభ కార్యక్రమంలో మొదటగా రైతులకు రాయితీపై పవర్ టిల్లర్లు, బ్యాటరీ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. అలాగే నెల్లిపూడి, కొంతంగి, మండపం గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. తర్వాత ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ – "గత రెండు నెలలుగా అనారోగ్యం కారణంగా నేను ప్రజల్లోకి రాలేకపోయినా, అధికారులు, పార్టీ నాయకులు కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందారు, వారికి నా అభినందనలు" అని అన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, మహిళలు వ్యవసాయంలో భాగస్వామ్యం కావడం శ్లాఘనీయమని అన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగి సమాజంలో గౌరవంగా నిలవాలన్న లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అందులో భాగంగానే ఈ ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ శిక్షణ 90 రోజులు కొనసాగి, అనంతరం రూ.25,000 విలువైన కుట్టు యంత్రాన్ని మహిళలకు అందజేస్తామని వివరించారు. మహిళా ఎమ్మెల్యేగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. "గ్రామాల్లోని సమస్యలను నా దృష్టికి తీసుకురావండి, సంబంధిత అధికారులతో చర్చించి మౌలిక వసతులు కల్పిస్తాను" అని హామీ ఇచ్చారు. స్థానిక టీడీపీ నేత పర్వత సురేష్ మాట్లాడుతూ – "మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఎమ్మెల్యే సత్యప్రభ ప్రోత్సాహంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు జరిగాయి. గ్రామ అభివృద్ధికి ఇంకా ప్రాధాన్యత ఇవ్వాలి" అని కోరారు. శంఖవరం పర్యటన సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే సత్యప్రభకు ఘన స్వాగతం పలికారు. మధ్యవీధి రామాలయం నుంచి సభావేదిక వరకు పూలవర్షం కురిపిస్తూ అలంకార స్వాగతం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బద్ది రామకృష్ణ, వెన్నా శివ, మేడిశెట్టి సూర్యకిరణ్





(బాబి), కరణం సుబ్రహ్మణ్యం, మేకల కృష్ణ, ఉల్లి వీరభద్రరావు, బచ్చల గంగ, కొండమూరి చంటిబాబు, ఈగల దేవుళ్ళు, గాబు సుభాష్, ఎంపీడీవో ప్రసాద్, వ్యవసాయ శాఖాధికారి గాంధీ, పోలం చిన్న, బొర్రా వరప్రసాద్, వాసు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పరోక్షసేవగా.. నందీశ్వరస్వామికి విశేషార్చన...

**శ్రీశైలం, మే 9 (జనస్వరం) :** శ్రీశైలం భ్రమరాంభ మల్లికార్జున స్వామివార్ల సన్నిధానంలో త్రయోదశి ఘడియలను పురస్కరించుకుని శుక్రవారం నందీశ్వరస్వామి (శనగల బసవన్న) వారికి విశేష ఆర్చనలు నిర్వహించబడ్డాయి. లోకకల్యాణం కోసం ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానం ఈ కైంకర్యాన్ని నిర్వహిస్తుంది. ప్రతి త్రయోదశి రోజున భక్తులు నందీశ్వరస్వామి పూజను పరోక్ష సేవగా జరిపించుకునే అవకాశం కల్పించబడిందని కార్యనిర్వాహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ శుక్రవారం నాడు మొత్తం 17 మంది భక్తులు ఈ పరోక్ష సేవను జరిపించుకున్నారని ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాక కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా వంటి ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు ఈ సేవలో పాల్గొన్నారని తెలిపారు. విశేష ఆర్చనలో భాగంగా ముందుగా అర్చక వేదపండితులు లోకక్షేమాన్ని కాంక్షిస్తూ మహాగణపతి పూజ నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా నందీశ్వరస్వామికి మల్లికా గుండం నుంచి తెచ్చిన శుద్ధ జలంతో అభిషేకం చేయడంతోపాటు, అన్నాభిషేకం చేశారు. పురుషసూక్తం, వృషభసూక్తం వంటి వేదమంత్రాలతో అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్ర సమర్పణ, విశేష పుష్పార్చనలు నిర్వహించి, నానబెట్టిన శనగలను సమర్పించారు. త్రయోదశి రోజున నందీశ్వరస్వామి పరోక్ష సేవ కోసం భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116/-ను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ సేవను www.srisailadevasthanam.org లేదా aptemples.ap.gov.in వెబ్‌సైట్‌ల ద్వారా బుకింగ్ చేసుకోవచ్చునని కార్యనిర్వాహణాధికారి తెలిపారు. మరిన్ని వివరాల కోసం దేవస్థానం సమాచార కేంద్రాన్ని



83339 01351 / 52 / 53 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# శారదాపీఠంపై చర్యలు ఏవీ? : 8 వారాలు గడిచినా ప్రశ్నిస్తోన్న తెలుగు శక్తి

**పెందుర్తి, మే 9 (జనస్వరం) :** శారదాపీఠం ఆక్రమిత భూముల్లో చేపట్టిన నిర్మాణాలపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ తీవ్రంగా ప్రశ్నించారు. పెందుర్తి తహసీల్దార్ ఎం. ఆనంద్ కుమార్‌ను శుక్రవారం సమావేశమై ఈ అంశంపై వివరణ కోరారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్రమ నిర్మాణాలపై తాను గతంలోనే పోరాటం ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. బి.వి. రామ్ వెల్లడించిన వివరాల ప్రకారం, మార్చి 23న తహసీల్దార్‌ను కలిసినప్పుడు, శారదాపీఠ ప్రతినిధులు నాలుగు వారాల గడువు కోరినట్లు తహసీల్దార్ సమాచారం ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు ఎనిమిది వారాలు గడుస్తున్నా అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకపోవడం సరిఅనిపించడం లేదని విమర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, మేయర్ పీలా శ్రీనివాస్‌లకు వివరించినట్లు తెలిపారు.

**అదృశ్య శక్తి ఎవరు? :**

ఈ పరిణామాల వెనుక అదృశ్య శక్తి వ్యవహరిస్తోందని బి.వి. రామ్ ఆరోపించారు. విశాఖపట్నంలో కొంతమంది తెలుగుదేశం నాయకులు వైసీపీకి, శారదాపీఠానికి రక్షణగా నిలుస్తున్నారని అన్నారు. ముఖ్యంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, ఎంపీ శ్రీ భరత్, పార్లమెంటరీ అధ్యక్షుడు గండి బాబ్జిలలో ఎవరో ఒకరు ఈ వ్యవహారానికి కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ అదృశ్య శక్తిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వాస్తవాలు వెలికి తీయడానికి ప్రత్యేకంగా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

**భీమిలి ఫైలు అడ్డుకున్న ఘటన :**

గతంలో భీమిలిలో శారదాపీఠానికి కేటాయించిన భూముల ఫైలు తరలింపును టీడీపీ నేత పల్లా శ్రీనివాసరావు అడ్డుకున్నారని బి.వి. రామ్ ఆరోపించారు. అయితే, తెలుగు శక్తి రంగంలోకి దిగడంతో ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యమైందని



తెలిపారు.

**పాత్రికేయులకు భూములు కేటాయించాలి :**

ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకున్న భూములను ఎంతోకాలంగా ఇంటి స్థలాల కోసం ఎదురుచూస్తున్న పాత్రికేయులకు కేటాయించాలని బి.వి. రామ్ విజ్ఞప్తి చేశారు. నిస్వార్థంగా సమాజానికి, ప్రభుత్వానికి మధ్య సేవలందిస్తున్న పాత్రికేయులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

జన స్వరం
www.janaswaram.com
తెలంగాణ

## ప్రతిపాడు మండలంలోని పలు వేడుకల్లో ముదునూరి

**ప్రత్తిపాడు, మే 9 (జనస్వరం) :** ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకుడు, ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణ రాజు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ధర్మవరం గ్రామంలో కాళ్ల ఏసుబాబు కుమారుడి వివాహ వేడుక, రామిరెడ్డి నారాయణరావు కుమారుడు అర్జున్ వివాహ వేడుక, బొడ్డు వెంకటేశ్వరరావు కుమారుడు మనోజ్ వివాహ వేడుకల్లో పాల్గొన్న మురళీకృష్ణ రాజు, వారి దాంపత్య జీవితం సుఖమయం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ బెందుకుర్తి సుశీల అబ్బాయ్, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, తుపాటి బాబ్జి, జువ్వల ముసలయ్య, యాళ్ల యేసు, నల్లా వెంకటేష్, రాపా అప్పన్న తదితర వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.





## ఈ నెల 15వ తారీఖున యలమంచిలి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**అచ్చుతాపురం, మే 9 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను అచ్చుతాపురంలోని కె.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో యలమంచిలి నియోజకవర్గ శాసన సభ్యుడు సుందరపు విజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ నెల 15న యలమంచిలి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. యలమంచిలి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 15 బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అందుకే నిరుద్యోగ యువకులు, యువతులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. గోవిందారావు సహా ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## మంత్రి నారాయణ కి ఆహ్వాన పత్రిక అందజేసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

**నెల్లూరు, మే 9 (జనస్వరం) :** మే 15వ తేదీన నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రారంభించనున్న 339 అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు ఆహ్వాన పత్రికతో పాటు, రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరణాత్మక బుక్‌లెట్‌ను తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అందజేశారు. నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు తెలియజేశారు. అనంతరం వారు అనేక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆహ్వానం

**నెల్లూరు, మే 9 (జనస్వరం) :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మే 15న జరగనున్న 339 అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి సంబంధించి, నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌ను స్వయంగా కలిసి ఆహ్వాన పత్రికను తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ నగర మేయర్ నందిమండలం భానుశ్రీ, క్లస్టర్ ఇంచార్జ్ షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలంలో వాహనాల తనిఖీలు

**శ్రీశైలం మే 9 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో ఇండియా-పాకిస్థాన్ మధ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో శ్రీశైలంలో దేవస్థానం అధికారులు భద్రతా చర్యలు ముమ్మరం చేశారు. శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు,మరియు నంద్యాలజిల్లా ఎస్ పి. అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలతో ఆలయ సిఎస్ఓ ఆధ్వర్యంలోస్థానిక పోలీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ప్రతి వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేవస్థానం పరిధిలోకి ప్రవేశించే దేవస్థానం టోల్గేట్ వద్ద ప్రతి ఒక్క వాహనాలను నిలిపి వాహనం లోపల క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి శ్రీశైల క్షేత్రంలోనికి అనుమతిస్తున్నారు.



# సోలార్ లైట్ ఓపెనింగ్



**కొయ్యూరు, మే 9 (జనస్వరం) :** శుక్రవారం అల్లూరి జిల్లాలోని కొయ్యూరు మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు ఆదర్శ పంచాయతీలలో ఒకటైన మర్రివాడ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. సోలార్ లైటింగ్ స్కీమ్ కింద పంచాయతీకి రూ.6 లక్షలు, అలాగే నీటి పథకాలకు మోటార్ ఇంజన్లు, తార్పలాలు, పంపులు, దుక్కు దున్నే నాగళ్ళు, చెట్లు వంటి వనరుల కోసం 90 శాతం సబ్సిడీతో రూ.50 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం రోజున తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, మర్రివాడ గ్రామంలో కొబ్బరికాయ కొట్టి సోలార్ లైట్లను ప్రారంభించారు. గ్రామంలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం కొయ్యూరు మండల అధ్యక్షుడు గొలిసింగి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్తులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింహాచలం ఈవో సస్పెండ్

**- అధికారులపై కఠిన చర్యలు**



**విశాఖపట్నం, మే 9 (జనస్వరం) :** సింహాచలం చందనోత్సవం సందర్భంగా జరిగిన ఘోర ప్రమాదంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన నేపథ్యంలో, దేవస్థానం ఈవో కె. సుబ్బారావును సస్పెండ్ చేస్తూ రెవెన్యూ (విజిలెన్స్) విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈవో సుబ్బారావు ఎలాంటి అనుమతులు లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఘటనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈవోతో పాటు, ఈఈ డీజీ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఈఈ కేఎస్ఎన్ మూర్తి, జేఈ కె. బాబ్జీ, ఏపీటీడీసీకి చెందిన ఈఈ కె. రమణ, డిప్యూటీ ఈఈ ఏబీవీఎల్ఆర్ స్వామి, ఏఈ పి. మదన్‌మోహన్‌లను కూడా సస్పెండ్ చేసినట్లు సమాచారం. మిగతా ఆరుగురికి సంబంధించిన సస్పెన్షన్ ఉత్తర్వులు గురువారం సాయంత్రం వరకు వచ్చినప్పటికీ, అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందన్న సంకేతాలు స్పష్టమయ్యాయి.

# మురళీ నాయక్‌కు జనసేన నాయకుడు రెడ్డి అప్పల నాయుడు నివాళులు



**ఏలూరు, మే 9 (జనస్వరం) :** దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన సైనికుడు మురళీ నాయక్ వీర మరణం పట్ల ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పల నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వీర జవాన్ మురళీ నాయక్ తన ప్రాణాలను త్యాగం చేసి భరతమాత ఋణం తీర్చుకున్నారని కొనియాడారు. భారత త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయడానికి ఆయన చేసిన ధైర్యం, త్యాగం, దేశభక్తి మరువలేనిదని గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌కు జనసేన పార్టీ తరపున ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీ నాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి దేవుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. మురళీ నాయక్ చూపిన ధైర్యం, త్యాగం, దేశభక్తి భారత యువతకు శాశ్వతంగా మార్గదర్శకంగా నిలుస్తుందని రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు.




# కులాన్ని అడ్డుపెట్టుకుని పంచాయతీ కార్యదర్శులను, అధికారులను బెదిరిస్తున్నారు

**భీమడోలు, మే 9 (జనస్వరం) :** కులాన్ని అడ్డుపెట్టుకుని అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతూ, రాజ్యాంగ వ్యవస్థకు మచ్చతెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ దళిత సంఘం నాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికు ఫిర్యాదు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలోని భీమడోలు మండలం లోని నెహ్రూనగర్‌కు చెందిన కొత్తపల్లి చంద్రమౌళి అనే వ్యక్తి, పంచాయతీ కార్యదర్శులు మరియు అధికారులను కులం పేరిట బెదిరించడం, మహిళా ఉద్యోగులను అసభ్య పదజాలంతో ఇబ్బంది పెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్టీఐ పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే "పెద్ద ఎత్తున అవినీతి జరిగింది" అని ప్రచారం చేస్తున్నాడని దళిత సంఘం నేతలు తెలిపారు. ఇలా కులాన్ని అడ్డుపెట్టుకుని, విధులను నిర్విరామంగా నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు అన్నారు. భీమడోలు జాతర సందర్భంగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన తనుజా, 24 గంటలు గ్రామంలో అందుబాటులో ఉండి, పారిశుద్ధ్య పనుల్లో కీలక పాత్ర పోషించారని, గ్రామ ప్రజలందరినీ ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ, తనుజా తన విధుల్లో భాగంగా డ్రైనేజీ పై అక్రమంగా కట్టిన గోడను తొలగించిందనే కారణంతో ఆమెపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం చాలా సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ లక్ష్యాల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని దళిత సంఘం నాయకులు పైడమాల యుగంధర్, గోగులమూడి రవికుమార్, టి. శాంతిభూషణం తదితరులు జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



# నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికే ఉపాధ్యాయుల లక్ష్యం

**దెందులూరు, మే 9, (జనస్వరం) :** పదో తరగతి మరియు ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి, ప్రభుత్వ నిర్వహించే శిక్షణా తరగతుల్లో పాల్గొని, వారందరూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతగా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం, దెందులూరు మండలం, శ్రీమతి గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల నందు పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ ప్రతి తరగతి గదిని పరిశీలించి, విద్యార్థులు ఏ విధంగా చదువుకుంటున్నారు, ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారు అన్నది పరిశీలించారు. ఈ సప్లమెంటరీ పరీక్షల్లో అందరూ పాస్ అవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, ప్రతి విద్యార్థి కూడా ఈ ప్రత్యేక తరగతులకు హాజరై పాస్ కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, విద్యార్థులను పాఠశాలకు ప్రత్యేక తరగతులకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి, వారు ఇంటిలో ఏ సమయం వరకు చదువుతున్నారు, పాఠశాలకు ఎప్పుడు వస్తున్నారు, ఎప్పుడు వెళ్ళిపోతున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. జరగబోయే సప్లమెంటరీ పరీక్షల్లో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులు పాస్ అయ్యి, పై తరగతులకు వెళ్లాలని ఆకాంక్షించారు. దెందులూరు హైస్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. మల్లికార్జున్ రావు, పిజి ఉపాధ్యాయులు లోవరాజు, శ్రీనివాసరావు, భాస్కర ప్రసాద్, జయశ్రీ, ఉపాధ్యాయులు, గ్రంథ పాలకులు గుళ్లపూడి వెంకటేశ్వరరావు, రికార్డు సహాయకులు జి. వెంకట్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆరవల్లిలో ఉద్రిక్త వాతావరణం : అంబేద్కర్ హోర్డింగ్ తొలగించేందుకు యత్నం, గ్రామస్థుల ఘాటైన ప్రతిఘటన

**ఆరవల్లి, మే 9 (జనస్వరం) :** స్థానిక గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన "ఐ లవ్ అంబేద్కర్ — మన ఆరవల్లి" అనే హోర్డింగ్‌ను తొలగించేందుకు కొన్ని సంఘ విద్రోహ శక్తులు ప్రయత్నించాయి. అయితే ఈ చర్యలను గ్రామంలోని ఎస్సీ యువతీ యువకులు తీవ్రంగా ప్రతిఘటించి, వారిని వెళ్ళగొట్టారు. స్థానికంగా ప్రతాప్ కుమార్ అనే ప్రముఖ వార్తాపత్రిక విలేఖరి రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను అనుభవిస్తూ, రాజ్యాంగ నిర్మాతను అవమానించే కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ సభ తీర్మానం కోసం మూడు పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చినా, గ్రామ పంచాయితీ స్పందించకపోవడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, పోలీసులతో కలిసి వచ్చిన ప్రతాప్ కుమార్ మరియు మరికొందరు మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో హోర్డింగ్ తొలగించేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు తీవ్రంగా ప్రతిఘటించారు. మహిళలు, యువకులు ప్రాణత్యాగాలకైనా సిద్ధమని స్పష్టం చేస్తూ, హోర్డింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించేందుకు వీలు లేదని గట్టిగా నిలదీశారు. గ్రామస్థులు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామ పంచాయితీ నుండి స్పష్టమైన తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



# స్వచ్ఛభారత్ కార్యక్రమంలో బొబ్బేపల్లి సురేష్ నాయుడు

**- గిరిజన కాలనీలో చెత్త తొలగింపు, మొక్కల నాటింపు**

**సర్వేపల్లి, మే 9 (జనస్వరం) :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు నాయకత్వంలో వెంకటాచలం మండలం జంగాలపల్లి గిరిజన కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మేపల్లి పంచాయతీ పరిధిలోని రాళ్లపల్లికి అనుకుని ఉన్న ఈ గిరిజన కాలనీలో ప్రభుత్వం కొంత స్థలాన్ని గిరిజనుల కార్యాలయ అవసరాల కోసం కేటాయించింది. అయితే ఈ స్థలం కంపచెట్లు, చెత్తతో పూర్తిగా నిండి ఉండటంతో, అక్కడ తిరగాలంటే గిరిజన పిల్లలు భయభ్రాంతులకు గురవుతుండగా, ఈ విషయం జనసేన నాయకులకు తెలిసి వెంటనే చర్యలు చేపట్టారు. శుక్రవారం ఏసీబీ సహకారంతో కంపచెట్లు తొలగించి, చెత్తను పూర్తిగా స్వచ్ఛం చేశారు. ఇకపై చెత్తని నిర్దిష్ట ప్రదేశాల్లో వేయేందుకు సిమెంట్ డస్ట్ బిన్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, చల్లని నీడనిచ్చే పచ్చని మొక్కలను నాటించి కాలనీలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడ్డారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ, "జనసేన పార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. గ్రామ పంచాయతీలలో ఇంకా వైసీపీకి చెందిన ప్రెసిడెంట్లు ఉన్నా, పవన్ కళ్యాణ్ తీసుకువచ్చిన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం బాధాకరం. స్థానిక ఎన్నికల్లో ప్రజలు చెత్త రాజకీయాలను తొలగించి కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధి బాటలో నడిపించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, పినిశెట్టి మల్లికార్జున్, వెంకటాచలం మండల నాయకులు చెంచయ్య, మణి, చిరంజీవి, స్థానిక గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**వీరులపాడు, మే 9 (జనస్వరం) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీసి, వారికి అవకాశాలు కల్పించేందుకు కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసరావు తెలిపారు. ఈ టోర్నమెంట్ శుక్రవారం జమ్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండ్రగుంట శ్రీనివాసరావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామాల పరిపూర్ణ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వికసిత్ పంచాయతీ' కార్యక్రమంలో భాగంగా క్రీడలను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ ఏర్పాటైంది," అన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. మే 9, 10, 11 తేదీల్లో లీగ్ మ్యాచులు జరుగనున్నాయి. మొత్తం 20 జట్లు ఈ టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. లీగ్ మ్యాచుల అనంతరం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. విజేత జట్లకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చేతుల మీదుగా ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ ఛాంపియన్స్ యర్రంరెడ్డి ప్రదీప్ కుమార్, కట్ట సునీల్, సింగి సురేష్, కొప్పుల రాము, ఆవుల దొడ్డి హనుమంతరావు, కారం శ్రీనివాసరావు, అలాగే జమ్మవరం, బోడవాడ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## పాకిస్థాన్ యుద్ధంలో అమరుడైన మురళీ నాయక్‌కు మా జోహార్లు



**పుట్టపర్తి, మే 9 (జనస్వరం) :** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాకు చెందిన 2022లో అగ్నివీర్ జవాన్‌గా చేరిన మురళీ నాయక్ ఈరోజు దేశ రక్షణలో వీర మరణం పొందడం అత్యంత బాధాకరమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక, యావత్ భారతదేశ ప్రజలకు స్ఫూర్తిదాయకం అని వారు అన్నారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో మురళీ నాయక్ అసాధారణ ధైర్యసాహసాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, "మన పుట్టపర్తి నియోజకవర్గం గర్వించదగ్గ ఈ వీర జవాన్‌కు మా తరపున, నియోజకవర్గ ప్రజల తరపున గౌరవప్రదమైన నివాళులు అర్పిస్తున్నాం. మురళీ నాయక్ తల్లితండ్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి సెల్యూట్ చేస్తున్నాను." మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కూడా, "మురళీ నాయక్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది. భారతీయులు ప్రతి ఒక్కరూ వారి కుటుంబానికి మద్దతుగా నిలబడాలి," అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మురళీ నాయక్ కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేసినట్లు పేర్కొన్నారు. అంతిమంగా, "మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం," అని పల్లె సింధూర రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు.

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

## - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఘన స్వాగతం, అభివృద్ధి పనులపై వినతి

**పుట్టపర్తి, మే 9 (జనస్వరం) :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి ఉత్సవాల సందర్భంగా అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. శుక్రవారం, ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం పంచాయతీలో హంద్రీనీవా సుజల స్రవంతి పనుల పరిశీలన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సత్యసాయి విమానాశ్రయంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛంతో ముఖ్యమంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును పుట్టపర్తి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సుమారు రూ.120 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. ఆయన సూచించిన అభివృద్ధి పనుల్లో ముఖ్యమైనవి పుట్టపర్తి నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల రీమెడియల్ పనులు. మమదాబాద్ క్రాస్ నుంచి బాలసముద్రం సి.జి. ప్రాజెక్ట్ వరకు రోడ్డు మరమ్మత్తులు చేయాలని, ఈ రహదారి అభివృద్ధి పర్యాటక, వాణిజ్య ప్రయోజనాలను కలిగిస్తుందని చెప్పారు. అదే సమయంలో, కొత్త చెరువు మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం గురించి పేర్కొన్న ఆయన, 2 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎస్టీ, ఎస్సీ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం కూడా సుమారు రూ.13.6 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని, 14.3 కోట్ల నిధులతో రోడ్ల మరమ్మత్తుల కోసం కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇతర అభివృద్ధి పనులలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాల కింద త్రాగునీటి పథకాలు అమలు చేయాలని, రూ.2.7 కోట్లు, రూ.4.45 కోట్లు, రూ.3.5 కోట్లు ను ప్రత్యేకంగా కోరారు. ఇక, తుమ్మల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్‌గా



మార్చే పని నూతనంగా ప్రారంభించాలన్నారు. ఈ విషయంపై సీఎం సానుకూలంగా స్పందించారు, తన ప్రత్యేక కార్యదర్శికి ఎమ్మెల్యే ఇచ్చిన వినతి పత్రాన్ని వెంటనే అందజేశారు.

# 35వ నేషనల్ కెనోయ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన వర్షితకు ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు

**విజయవాడ, మే 9 (జనస్వరం) :** భోపాల్‌లో లోయర్ లేక్ వేదికగా ఏప్రిల్ 24 నుండి 28 వరకు నిర్వహించిన 35వ నేషనల్ కెనోయ్ స్ప్రింట్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన అథ్లెట్ గొలుగూరి వర్షితను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం ఘనంగా సత్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో వర్షిత తన తండ్రి రాజేష్ రెడ్డితో కలిసి ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. వర్షిత సబ్-జూనియర్ కేటగిరీ కే4 500 మీటర్ల విభాగంలో ఒడిశా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానం సాధించినట్లు ఎంపీకి వివరించింది. ప్రస్తుతం వర్షిత పటమటలోని ఎన్.ఎస్.ఎం పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. చదువులోను, క్రీడల్లోను మంచి ప్రతిభ కనబరుస్తున్న వర్షిత భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి గౌరవం తీసుకురావాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి. నాగేశ్వరరావు, విజయకృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వెలగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

**పులివెందుల మే 9 (జనస్వరం) :** పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని పాత్రికేయులు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు హోదాలు చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటువంటి ముందస్తు నోటీసులు లేకుండా సోదాలు చేయడానికి వెదసిస్తూ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ హరినాద్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంపై విజయవాడ నగర సెంట్రల్ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ప్రవేశించి సెర్చ్ చేయడాన్ని ఇది పత్రికా స్వేచ్ఛకు పూర్తి స్థాయి విఘాతంగా భావిస్తున్నామన్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీయడంతోపాటు, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికారంగంపై దాడిచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని భవిష్యత్తులో మొత్తం మీడియాపై ఇవేదాడులు, ఇవే ఆంక్షలు, ఇలాంటి బెదిరింపులు కొనసాగే పరిస్థితిని ప్రభుత్వం తీసుకురావడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం అయిన మీడియా పరిరక్షణకు పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి. అవినీతి వార్తలు రాస్తే ఎడిటర్ కుటుంబాన్ని భయ భ్రాంతులకు గురి చేసేలా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నామన్నారు. .ప్రభుత్వ పెద్దలకు సాక్షి యాజమాన్యంపై ఉన్న రాజకీయ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు జర్నలిస్టులపై ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు భావించాల్సి వస్తున్నది. సాక్షి పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం, సంపాదకుని ఇంటిలో సోదాలు చేయడం పాత్రికేయులను భయభ్రాంతులకు గురి చేయడానికేనని



మేం భావిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) యూనియన్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, ఏపీడబ్ల్యూజే ఎఫ్, తెలుగు యూనియన్ జర్నలిస్టు ఫోరం జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కడపలో రీల్స్ పేరుతో యువకుల పైశాచికత్వం




**పులివెందుల మే 9 (జనస్వరం) :** కడపలో కొందరు యువకుల పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. దయ్యాల పేరుతో పాడుబడిన భవనాల వద్ద వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. కడపలోని తెలుగు గంగ కాలనీ, మదీనా ఇంజినీరింగ్ కళాశాల, ఓల్డ్ రిమ్స్ లోని భవనాల వద్ద అర్ధరాత్రి వీడియోలు తీస్తున్నారు. ఇలాంటి వీడియోలతో ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇస్తామని ఎస్పీ అశోక్ బాబు తెలిపారు.


# భవన నిర్మాణానికి దాతలు సహకరించాలి

**పులివెందుల మే 9 (జనస్వరం) :** పులివెందుల ప్రాంతం లో విశిష్ట సేవలు అందిస్తూ నియోజకవర్గం స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నూతన భవన నిర్మాణానికి సహకరించాలని సంస్థ అధ్యక్షులు మొమ్మెల.రాజు దాతలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు దాతలు అందజేసిన విరాళాలతో భవన నిర్మాణం పిల్లర్ ల వరకు నిర్మించడం తో పాటు విద్యుత్ సరఫరాకు ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ లైన్, నీటి కోసం బోరు బావి మరియు అందులో మోటార్ బిగించడం జరిగింది. తదుపరి నిర్మాణం కోసం దాతలు ముందుకు వచ్చి భవన నిర్మాణం లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువులు జరుపుకునే వివాహాలు, పుట్టినరోజు లాంటి శుభ కార్యాలు గాని వర్ధంతి జ్ఞాపకార్థాలు గాని, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక లాంటి సమావేశాలు , సంఘాలు, అసోసియేషన్ లు, యూనియన్ లు ఏ కార్యక్రమాలు అయినా వాటి సందర్భంగా కూడా విరాళాలు అందజేసి భవన నిర్మాణం లో భాగస్వాములు అవ్వొచు అని అలాగే ఎవరైతే 20 వేల రూపాయలు లేదా ఆ పై విరాళాలు అందజేసే వారి పేర్లు శాశ్వత శిలాఫలకం పై లిఖించబడును అలాగే పన్ను రాయితీ వెసులుబాటు కూడా అందని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా దాతలు స్పందించి విశిష్ట మరియు విస్తృత సేవలు అందించేందుకు భవన నిర్మాణం పూర్తి



చేసేందుకు ప్రతి ఒక్కరు సహృదయం తో స్పందించాలని, వివరాలకు 9966509364 దాతలు సంప్రదించాలని ఆయన కోరారు.

# భారత సైనికులు క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు



**పులివెందుల మే 9 (జనస్వరం) :** భారత సైనికులు క్షేమంగా ఉండాలని పెండ్లిమర్రి మండలం నంది మండలం సమీపంలోని కొండ గంగమ్మ తల్లికి శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు మహబూబ్ బాషా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లో పహల్గామ్ దాడి జరిగిన సరిగ్గా 15 రోజుల తర్వాత భారతదేశం ప్రతీకారం తీర్చుకుందన్నారు.. తెల్లవారు జామున 1:44 గంటల ప్రాంతంలో భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌లో పేరుతో పాకిస్తాన్, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందని, పహల్గమ్ ఉగ్రదాడికి సమాధానంగా జరిగిన ఆపరేషన్ సిందూర్ మన దేశ శక్తి సామర్థ్యాలను, మన సైన్యం పరాక్రమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారత సైన్యం మెరుపు దాడులు నిర్వహించి ఉగ్రవాదుల అంతమే భారతలక్ష్యమని తెలియజేసిందన్నారు. ఈ ఆపరేషన్ సింధూర్ లో భారత సైనికులు క్షేమంగా ఉండాలని. మరింత శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని తన కుమార్తె అర్ఫామహియా నేతృతంలో కొండ గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో శివ, నాగేంద్ర, రాజు ,గంగాధర్ పాల్గొన్నారు.

# శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జాతీయ టెక్నాలజీ దినోత్సవం

**పాలకొల్లు, మే 9 (జనస్వరం) :** పాలకొల్లు పట్టణంలోని శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జాతీయ టెక్నాలజీ దినోత్సవాన్ని, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం మరియు, ఐ క్యు, ఏసి ఇన్స్టిట్యూషన్.. ఇన్నోవేషన్, కౌన్సిల్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డా. వి యామిని ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఆమె మాట్లాడుతూ ఇటువంటి ముఖ్యమైన కార్యక్రమాలు విద్యార్థినీ విద్యార్థులకు అన్ని విషయాలలో అవగాహన కల్పిస్తాయని అన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంచార్జ్, ఐక్యూ ఏ సి కోఆర్డినేటర్ కె.భద్రాచలం మాట్లాడుతూ జాతీయ టెక్నాలజీ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. 1998లో ప్రోక్రాన్ న్యూక్లియర్ వెపన్స్ విజయవంతం అయిన సందర్భంగా, మే 11న టెక్నాలజీ దినోత్సవం గా ప్రకటించారని, ఆరోజునే మనం టెక్నాలజీ దినోత్సవాన్ని జరుపుకుంటామని చెప్పారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఏపీజే అబ్దుల్ కలాం వంటి సైంటిస్టుల కృషిని విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం టెక్నాలజీకి సంబంధించిన క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరిగా గత నెల రోజుల నుంచి కంప్యూటర్ స్కిల్స్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకుంటున్న ఇంటర్ పూర్తయిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఐ.సి కన్వీనర్ డాక్టర్ ఎం. రామకృష్ణ, సభ్యులు డాక్టర్ వి. విజయలక్ష్మి, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకులు సి.హెచ్ రవికుమార్,



బి.ఆశాజ్యోతి, పి జోత్స్నశ్రీ, డి. హెప్సీ రాణి, జి. వేణు మాధురి, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

# చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి



**పులివెందుల మే 9 (జనస్వరం) :** పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని కామసముద్రం చెరువులో చేపల వేట కోసం వెళ్లిన బెల్దారి కూలీ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ దుర్ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. కదిరి మండలం చింతకుంటపల్లి గ్రామానికి చెందిన ఎల్లనూరు హజరతయ్య (69) గత కొన్ని రోజులుగా కామసముద్రం గ్రామంలో బేల్దారి పనులు చేస్తున్నారు. మేస్త్రీ ఇటీవల కూలీ డబ్బులు చెల్లించి, “రెండు మూడు రోజులు పని లేదు, ఊరికి వెళ్లండి” అని సూచించినట్టు సమాచారం. దీంతో హజరతయ్య శుక్రవారం ఉదయం చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మునిగి మరణించాడు. ఈ విషయమై కేసు నమోదు చేశామని ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

# వీర జవాన్ మురళి నాయక్ కు అశ్రునివాళులు

**పులివెందుల మే 9 (జన స్వరం) :** దేశ సరిహద్దులో వీరమరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్ కు పలువురు రాజకీయ నాయకులు, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలు అశ్రు నివాళులు అర్పించారు. సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం కల్లి తాండకు చెందిన నాయక్ పాక్ ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాటం చేసి ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడయ్యారు. యుద్ధ సమయంలో తెగువ చూపిన మురళి నాయక్ చివరకు కన్న భూమి ఒడిలోనే కనుమూశారు. మురళి నాయక్ వీర మరణం పట్ల పౌరులందరూ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మురళి నాయక్ వీరమరణం పొందిన సమాచారాన్ని తెలుసుకున్న మంత్రి సవితమ్మ హుటాహుటిన కల్లితాండ గ్రామానికి వెళ్లి నాయక్ తల్లిదండ్రులను ఓదార్చారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఫోన్ ద్వారా నాయక్ తల్లిదండ్రులను ఓదార్చారు. నిబ్బరంతో ఉండాలని చంద్రబాబు నాయక్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మొత్తం మీద నాయక్ వీరమరణం పట్ల సీమ ప్రజానీకం విచారం వ్యక్తం చేస్తోంది.





# కొండాయపాలెం గేట్, బి.వి. నగర్ వాసుల దశాబ్దాల కల సాకారం దిశగా రైల్వే అండర్ బ్రిడ్జీలకు మొదటి అడుగు

**నెల్లూరు, మే 9 (జనస్వరం) :** కొండాయపాలెం గేట్, బి.వి. నగర్ వాసుల దశాబ్దాల కల నెరవేరబోతుంది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చొరవతో కొండాయపాలెం గేట్, బి.వి. నగర్ రైల్వే అండర్ బ్రిడ్జీల ప్రగతి వేగం పెరుగుతోంది. ఈ క్రమంలో, నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో రైల్వే అండర్ బ్రిడ్జీలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, “కొండాయపాలెం గేట్, బి.వి. నగర్ వాసుల దశాబ్దాల కలను నెరవేర్చేందుకు మా ప్రయత్నాలు ఫలించబోతున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎప్పటికప్పుడు ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు. రైల్వే అధికారులు జూన్ నెలాఖరులోపు టెండర్లు పూర్తవుతాయంటూ హామీ ఇచ్చారు. దేవుడి దయతో టెండర్లు వేగంగా పూర్తయి పనులు మొదలవుతాయని ఆశిస్తున్నాం. స్థానిక శాసనసభ్యుడిగా నా శక్తికి మించి కృషి చేస్తున్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో ఎట్టి పరిస్థితుల్లోనైనా కొండాయపాలెం గేట్, బి.వి. నగర్ రైల్వే అండర్ బ్రిడ్జీలను సాధించడమే మా లక్ష్యం” అని పేర్కొన్నారు.



# ‘ఆపరేషన్ సింధూర్–2’లో వీర మరణం పొందిన మురళి నాయక్ కు ఘన నివాళి

**పుట్టపర్తి, మే 9 (జనస్వరం) :** శ్రీ సత్య సాయి జిల్లా, పెనుగొండ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన జవాన్ ఎం. మురళి నాయక్ జమ్మూ కాశ్మీర్‌లో పాక్ ముష్కరులతో జరిగిన భీకర పోరులో ప్రాణత్యాగం చేశారు. పహాల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్–2 లో భాగంగా మురళి నాయక్ దేశం కోసం వీరమరణం పొందారు. అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళి నాయక్ జవాన్ వీరత్వానికి యావత్ దేశం మౌనవందనం చెబుతోంది. ఆయన వీరమరణం వార్తతో దేశమంతా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ఆత్మస్థైర్యం ప్రసాదించాలని కోరుతూ ఈరోజు కదిరి పట్టణంలో కాలేజ్ సర్కిల్ నుండి అంబేద్కర్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

